
రైతురాయలు
(శ్రీకృష్ణదేవరాయలు)

# రైతురాయలు
## (శ్రీకృష్ణదేవరాయలు)

**'RAITURAYALU - SRIKRISHNA DEVARAYALU'**
by
**Gooty (Joladarasi) Chandrasekhara Reddy**

**ఆధారం :**
**గోపినోళ్ళ చెరువు : (దీపం చెప్పిన కథలు)**

**రచన :**
**గోపిని కరుణాకర్**


మూల్యం : రు.50/-

ప్రచురణ : 29 నవంబర్, 2009

రెండవ ప్రచురణ : డిసెంబర్, 2012

ప్రతులు : 1000

ప్రతులకు : **గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి**
15, మొదటి దశ, జయప్రకాశ్ నగర్,
(వయా) మియాపూర్, హైద్రాబాదు-500 050.
ఫోన్ : 91779 45559

**ఆర్ట్స్ అండ్ లెటర్స్**
C/o. హైదరాబాద్ స్టడీ సర్కిల్,
1-2-365/25 సి, దోమలగూడ,
ఇందిరా పార్క్ రోడ్ దగ్గర,
హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 9704640273

**నవోదయ బుక్ సెంటర్**
ఆర్యసమాజ్ రోడ్, కోఠి, హైదరాబాద్.

డి.టి.పి : గంగవరపు సుజల
Design & Print House, Hyderabad
Ph : 92489 00437

ముద్రణ : కర్షక్ ప్రింటర్స్, హైదరాబాదు

# రైతురాయలు

## (శ్రీకృష్ణదేవరాయలు)

**రచన**

గుత్తి (జోళదరాశి) చంద్రశేఖర రెడ్డి

2009



**గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి,**
15, ఫేజ్-1, జె.పి.ఎన్.నగర్, మియాపూర్, హైదరాబాద్-50.
మొబైల్ :91779 45559

# ఆనంద నివేదనం

'కన్నడరాయా' అని తెలుగురాయలైన ఆంధ్ర మధుమదనునితో తనను నోరారా పిలిపించుకొన్నాడు. కన్నడరాజ్య రమారమణా అన్నారు అష్టదిగ్గజకవులు. ఆయన తెలుగు మాట్లాడినేర్చినదే కానీ అది ఆయన స్వభాష కాదు, ఆయన దానిని చదువుకోనూ లేదు. అల్లసాని పెద్దనే వ్రాసి రాయని పేరుంచడమో లేక అడుగడుగునా తోడైనిల్చి కృతి నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీ కావడమో జరిగి వుండాలని వేదం వారి వేదాంతం. ఆయన మాతృభాష తుళు అయి వుంటుందన్నది నారాయణరెడ్డిగారి తలపోత.

అతడు నాగమాంబ కుమారుడు. నరసనాయకుని ద్వితీయపత్ని యైన ఆమె తెలుగింటి ఆడబడుచు. ఎక్కువ కాలం తల్లితోనే వుండటంవల్ల నైతేనేం, తెలుగు వాడైన తిమ్మరుసుగారి సర్యవేక్షణలో పెరగడంవల్ల నైతేనేం అతనిలో తెలుగు భాషాభిమానం పుట్టుకతో వచ్చింది. అందుకే తను రాజు కాగానే తన పాలననంతా తెలుగువారితో నింపేశాడు. తెలుగు దేవుళ్ళయిన శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువునూ, తిరుమల వేంకటేశ్వరుణ్ణీ కొల్చి కర్ణాటక దేవుడైన విరూపాక్షుడి పట్ల ఉదాశీనతను ప్రదర్శించాడు. తెలుగు కృతివ్రాసినా, తెలుగు సాహిత్యాన్ని ఇతోధికంగా పోషించినా అందుకిదీ కారణం - ప్రఖ్యాత పరిశోధకులు, సాహిత్యవేత్త కన్నడ విశ్వవిద్యాలయపు నివృత్త, ఉపకులపతులూ అయిన శ్రీ యం.యం. కల్బుర్గిగారి తీవ్ర విమర్శ! ఆయన కొలువు కూటంలోనూ, రెండవ అంతఃపురాల్లోనూ విరివిగా, మరో అంతఃపురంలో కొంచెంగా జెంటూ భాష వినిపించేదని (తెలుగు) పోర్చుగీసు యాత్రికుల సూత్రీకరణ. తొలినాళ్ళలో వారి పూర్వులు తుళు మాతృభాషీయులైనా నరసనాయకుని కాలానికే వారు పూర్తిగా తెలుగు వారైపోయారన్న కర్ణాటక ఇతిహాస అకాడమీ అధ్యక్షులు సూర్యనాథ కామత్‌గారి ఉవాచ!

'రైతురాయలు' అని పిల్చుకొన్న కృతిలో ఈ గోల అంతా ఏమిటంటారా? నూటికి నూరుపాళ్ళూ తెలుగువాడై వుండి, తెలుగుతోబాటు సంస్కృత, కన్నడ, తమిళ భాషల్ని

కూడ అంతే నేర్పుతో సాధించి మరికొన్ని భాషలు నేర్చిన ప్రభువు శ్రీకృష్ణరాయల నేపథ్యాన్ని వివరించడం కోసమే సుమా!

నిరంతర పుస్తక పఠనాభిలాషినైన నాకు నాలుగైదేళ్ళ క్రితం 'నవ్య' వారపత్రికలో వరుసగా వెలువడ్డ 'దీపం చెప్పిన కథలు' చదవడం తటస్థించి నన్ను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాయి. అందులో గోపినోళ్ళ చెరువు అన్నదీ, గోనూత, ఉత్తీత మొదలైనవీ నన్ను పరవశింపచేశాయి. చెరువుకథ మా రాయలవారికి సంబంధించినది. వ్రాసిన గోపిని కరుణాకర్‌ది జానపద కథన విన్యాసం, సరళమైన స్పష్టమైన సహజమైన నిరూపణ. అందుకే ఇన్నాళ్లూ గుండె గొంతుకలో కొట్లాడుతూ వచ్చిన కథ కావ్యాకృతి దాల్చడం. జానపదుల్లో స్థానిక ఐతిహ్యంగానున్న దాన్ని అక్షరాల్లో అందించిన గోపిని కరుణాకర్‌ని ఎంత అభినందించినా అతనికి ఎంత కృతజ్ఞతలు చెప్పినా చాలదు గాక చాలదు.

పల్లెల పాలిటి బువ్వపెట్టే తల్లిలాంటి చెరువుకథను తల్లికి సమర్పణ చేయడంలో నేనెంతో ఆనందం పొందుతున్నాను. నిజానికి నేనెరుగని కన్నతల్లి పార్వతమ్మతో పాటు ఆమె స్థానంలో వచ్చిన మా రెండో అమ్మ లక్ష్మమ్మా, మా అమ్మకు స్వంత అక్కా నాకు పెద్దమ్మా అయిన వెంకమ్మా, చిన్నతనంలో నన్నెంతో ప్రేమగా చూచిన మా మేనత్త భీమక్కా, పెళ్లాడి కాపురం చేసిన ముప్పైఆరేళ్ళలో నా ఆలనపాలనల్లో పై నలుగురి తల్లుల్నీ తలపింపచేసిన తల్లియై ఇటీవలే హరిసదనము చేరిన ఇల్లాలు సునీతమ్మా, వీరందరూ తల్లులే నాకు. సవతితల్లుల కథలనేకం చదివిన నాకు మా మనస్సుల్లో ఆ భావనే కలుగకుండా పెంచిపోషించిన మారెండో అమ్మను తలచుకొన్నప్పుడల్లా నాకెంతో ఆనందం కల్గుతుంది. భర్త గ్రామ తగాదాల్లో నిరంతరం ఒంటరి పోరాటం చేస్తూవుంటే తాను వ్యవసాయాన్నీ, కుటుంబాన్నీ ఒంటి చేతితో నడిపి, మా కందరికీ బ్రతుకునిచ్చిన తల్లి ఆమె. ఆమెకు నా కృతిని సమర్పించడం ద్వారా అయిదుగురు తల్లులకూ నా హృదయపూర్వక నమస్కృతులు తెల్పుకొంటున్నాను.

నా ఇద్దరు తమ్ముళ్ళ భార్యలై వచ్చి ఉపాధ్యాయ వృత్తిలో అత్యుత్తమ స్థాయిలోనున్న మా మరదళ్ళు శ్రీమతులు నిర్మలమ్మ, వసుంధరమ్మలు తమ అత్తను/అక్కను గురించి వ్యక్తీకరించిన అభిప్రాయాల్తో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తూ వారికి అభినందనలు తెలుపుకొంటున్నాను. చెల్లెళ్ళే కానీ అక్కలు లేని నాకు అయాచితంగా అక్క అయిన మామధుర కవయిత్రి ఆమెను నేను యశోదమ్మగా పిల్చుకొంటాను. హర్షామోదం తెలిపిన అక్క వేదవతమ్మకీ, స్నేహధర్మానికి భాష్యం చెప్పి నాలో సాత్వికమైన అసూయను రగిలింపచేసే కావ్యానుసృజనశీలి తేటగీతాచార్యుడూ 'కోమల సాహితీవల్లభుడూ' అయిన ప్రభాకరరెడ్డిగారికీ, అటు జానపదం ఇటు వచన

కవిత్వం ఈ రెంటిలో సవ్యసాచిత్వం నెరపుతూ, బెంగుళూరులో తెలుగు సాహిత్యబావుటా జేగీయమానంగా ఎగురవేస్తూ నాపై అంతులేని అభిమానం పెంచుకొన్న తంగిరాల వారికీ... కైమోడ్పులతో ఆశీస్సులర్థిస్తున్నాను.

ఇటీవలి నా రచనలను డి.టి.పి. చేస్తూ సహకరిస్తున్న సోదరి శ్రీమతి సుజల గంగవరపు గారికీ, మా పుస్తకాలు తమవిగా భావించి, శ్రద్ధగా ముద్రించడంలో పాలుపంచుకొంటున్న కర్షక్ ప్రింటర్స్ అదినేతలు శ్రీ జగన్మోహనరెడ్డి సోదరులకూ మనఃపూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

నా తెలుగు భాషాభిమానాన్నీ, కృష్ణరాయాభిమానాన్నీ రూపం దాల్చిన అభిమాన కృతుల్నీ అంతే ఆత్మీయంగా ఆదరిస్తున్న నా తెల్గు ప్రజాళికీ, కన్నడ సోదరులకూ అంజలి ఘటిస్తున్నాను.

ఇది గోపిని వారి కుటుంబంలో 500 ఏళ్ళ క్రితం నేటి ధర్మపురి జిల్లా హోసూరు ప్రాంతంలో జరిగిన కథగా కరుణాకర్‌గారు తెలుపుతున్నారు. చంద్రగిరిలో నేటికీ మూలస్థానమ్మ పూజలందుకొంటూనే వున్నది. ఆమెకు నా అంజలి.

ఇది మా ద్వితీయ కుమారుడు చి॥ వంశీధరరెడ్డి, చి॥ ల॥ సౌ॥ నిత్యను పెళ్ళాడుతున్న శుభసందర్భంగా వెలువరిస్తూ వారికి అందరి శుభాశీస్సులాశిస్తూ...

మీ

**గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి**

# మలిముద్రణ వేళ

శ్రీకృష్ణదేవరాయల పంచ శతాబ్ది పట్టాభిషేకోత్సవ సంరంభంవల్లనైతేనేమి, రాయలవారి మీద తెలుగు ప్రజలకున్న అపార అభిమానంవల్లనైతేనేమి, కథలో ప్రకటితమైన రాయల రైతు ప్రేమవల్లనైతేనేమి, కథనంలోని సరళ నిరూపణవల్ల నైతేనేమి, అచ్చమైన నుడికారాలవల్లనైతేనేమి రైతురాయల కావ్యాన్ని ప్రజలు తలకెత్తుకున్నారు. ఈ కావ్యం ఆధారంగా డా॥ ఎ.బి.కె. ప్రసాద్‌గారి నేతృత్వంలో రైతురాయల దివ్యచరితం పేరిట నృత్యరూపకం రాష్ట్రం నలుమూలలా ప్రదర్శింపబడి మన్ననలందుకొన్నది. ఇంకెందరో దీనిని తమ నృత్యరూపకాలలో వాడుకొని ప్రసిద్ధికి కారణమయ్యారు. అందువల్లనే ఈ మలిముద్రణ ఇందుకు నిరంతరంగా నన్ను ప్రోత్సహిస్తున్న డా॥ ప్రభాకరరెడ్డిగారికి నా కృతజ్ఞతలు.

రైతురాయలు చదివిన నా పాతమిత్రుడొకరు 30 ఏళ్ళ తరువాత పలుకరిస్తూ ఇవి తెలుగు పద్యాల్లాగ అనిపించలేదన్నారు. కారణమడిగితే ప్రతి ఒక్కటి సులభంగా అర్థమైపోతున్నాయన్నారు. ఇది ప్రశంసో, విమర్శో ఏమైనా ఈ మలిముద్రణకు స్ఫూర్తినిచ్చింది.

**గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి**

❖

**రాయలుగద్దె నెక్కి ఇపుడైదు శతాబ్దుల కాలమయ్యె నా**
**ప్యాయత నించుకంత వసివాడదు నిత్యవినూత్నమౌ విధిన్**
**తీయగ తల్చుకొందురిల తేజమునిండిన రాయగాథలన్**
**హాయిగ నెల్లకాలముల నాతని కీర్తులు ప్రజ్వరిల్లెడున్.**

**గోపినోళ్ల చెరువు గూర్చిన యొక గాథ**
**వ్యాప్తి చెందియుండె వసుధలోన**
**కృష్ణరాయ ప్రభుని కీర్తి కిరీటాన**
**ప్రభలు చిమ్ము మేలి వజ్రమట్లు.**

**కథామూలం : శ్రీ గోపిని కరుణాకర్** (దీపం చెప్పిన కథలు)
**కావ్యానుసృజనం : గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి**

# రైతురాయలు

కొత్త కోడలు చెంగమ్మ నెత్తి మీద
సద్ది కుండను దాలిచి యొద్దికగను
మడక దున్నుచు నున్నట్టి మగని దరికి
పయనమైనది చేనుకు బలుముదమున. 1

దట్ట మైనట్టి ఎండను తిట్టుకొనదు
తోడు లేరంచు నెవరిని దూరబోదు
మమతతో జూచు ముద్దుల మగనిచేర
పరుగు పరుగున సాగెను పడతి మిన్న. 2

దండి కండల మగని కైదండ తలచి
ప్రాణమున ప్రాణముగనెంచు భావమెంచి
కన్న వారల మరపించు కరుణ నరసి
ఎడద పొంగగ బిరబిర నడచె నామె. 3

[1]సవట వంకను డాసిన సమయమందె
ఎవ్వరో వెంట నంటిన సవ్వడాయె
ఘల్లుఘల్లంచు గజ్జెలు కదలినట్లు
గుండె ఝల్లన చెంగమ్మ కుదురుతప్పె. 4

ఆగ నాగును కదలిన యంత కదలు
అంతకంతకు చేరువై ఆగి పోవు
లేత చెంగమ్మ ధైర్యము రిత్తవోయి
పరుగు పరుగున తనపతి ప్రాపు జేరె. 5

[1]ఒక వాగు

పాలసంద్రము ద్రచ్చెడు వేళ, నమృత
పాత్ర దాల్చిన మోహిని పగిది దోచి
మందహాసము మొగమున మలయుచుండ
మడక నాపెను కదిరెప్ప మగువను గని. 6

కాడి తప్పించి ఎద్దుల కట్లు విప్పి
మేయగ రవంత ఎండిన మెద[1] విదిల్చి
తల రుమాలుతో చెమ్మట తడిని యొత్తి
పడతి చెంతకు కాల్దిసె తడవులేక. 7

సోగ కన్నుల తను జూచు సొగసుకత్తె
కనుల నిండుగ ననురాగ కాంతి దోప
క్షణమునందర్ధ మాత్రలో కాంతజేరె
కాపు కదిరెప్ప ఆకలి మోపు మీద. 8

ఎడమ అరచేయి దొన్నెగా మడచి సాప
గుంత జేసిన ముద్దలో చింత చిగురు
కలిపి నూరిన యూర్బిండి కడిని నింపి
మగని కందించె చెంగమ్మ మమతమీర. 9

కొసరి తినిపించుచును నామె కూడగట్టి
అలతి పలుకుల తనకైన యనుభవమ్ము
తెలియజేయగ నాయుడు పలికెనిట్లు
"భీతి చెందకు చెంగమా బెదరబోకు. 10

[1]ఎండిన జొన్నచొప్ప

మూలస్థానమ్మ ఆమెది పాలమనసు
ఆమె మన యింటి మురిపెంపు ఆడుబిడ్డ
ఎవరికిని హాని గలిగింప దింతయేని
ఏల వచ్చెనో నీవెన్క ఏమి కతమొ? 11

క్రొత్త దానిని నినుజూడ కూర్మి వచ్చె
నేమొ? నేమైన చెప్పగ నెంచెనేమొ?
ఆమె కోర్కెల దీర్చిన నమరు శుభము
మరలి పోవుచు నాయమ మాట వినుము." 12

అనుచు భోజనము ముగించి హాస్యముగను
ఆమె కొంగుకు తడి తుడ్చి, ఆదరమున
వీడు కొల్పియు ఎద్దుల జాడ నరసి
అతడు సాగెను వెనుకకు - ఆమె మరలె. 13

కొంగు జాడించి కృతకంపు కోపముసను
చెంగమ గృహంబునకు వేగ చేర నరుగ
దారిలో నొక్క తంగేడు తరువు నీడ
ప్రౌఢ యొకతె కూర్చుండి కన్పట్టెనపుడు. 14

పసిడి కాంతులనైన పరిహాసమును సేయు
పసుపు నలందిన వదనశోభ
అరుణోదయపు వేళ నవతరించెడు భాను
డనగ కుంకుమ బొట్టు నమర కాంతి
ముక్కున జెవులందు మురిపెంపు ముక్కర
నెరరాళ్ళ కమ్మలు మెరయుమహిమ
కాసె పోసి బిగించి కట్టిన ముదురాకు
పచ్చని చీర పావనత ఘనత

అచట నున్నట్టి యొకరాయి నధివసించి
మట్టి గాజుల గలగల మంజులముగ
రవళి చేయుచు చేసాచి రమ్మటంచు
పిలిచినది మూలస్థానమ్మ ప్రీతి మీర. 15

జంకు చూపెడు చెంగమ వంక జూచి
రమణి పిలిచెను చేసాచి రమ్మటంచు
"ముల్లుదిగినది కాల, నీ చల్ల నైన
చేతులను దాని దీయుము చిన్న దాన." 16

ఆమె గొంతుకలోని ఆప్యాయమరసి
చెంగమ ఎడంద నెదొ హాయి సేదదీర్చె
చెంత గూర్చుండి పాదాల చేతబట్టి
తొడల నిడుకొని ములుదీయ గడగెనామె. 17

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Raiturayalu**

* * *